నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, శనివారం 31 మే 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

అమెరికాలోని డాలస్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

# రేవంత్‌ది దుర్మార్గపు పాలన

**డాలస్‌లో జరిగే వేడుకను విజయవంతం చేద్దాం : మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

దేవరుప్పుల, మే 30 : మోసపూరిత మాటలతో ప్రజలను బురిడీ కొట్టించి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలో దుర్మార్గపు పాలన నడిపిస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. అమెరికాలోని డాలస్‌లో జూన్ ఒకటిన జరిగే బీఆర్ఎస్ రజతోత్సవాలు–తెలంగాణ ఆవిర్భావ వేడుకల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలిపిన కేసీఆర్ పాలనను ఓడించిన ప్రజలు పశ్చాత్తాపపడుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షపాత్ర పోషిస్తున్న బీఆర్ఎస్‌కు ప్రజల్లో ఆదరణ పెరిగిందన్నారు. పాలకుర్తిలో తనను ఓడించిన ప్రజలు తప్పు చేసినట్లు బాధపడుతున్నారని ఎర్రబెల్లి తెలిపారు. తెలంగాణ రైతు ధనవంతుడని చెప్పుకునేవారని, నేడు వ్యవసాయం సాగునీరు లేక, రైతుబంధు అందక, పండిన పట్లు కొనక రైతు డీలా పడినట్లు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో భూముల రేట్లు అమాంతం పడిపోయాయన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ ఆదాయం సగానికి సగం తగ్గిందని, ముఖ్యమంత్రే నేరుగా తెలంగాణ దివాలాతీసిందని, అప్పు పుట్టడంలేదని బాహాటంగా మీటింగ్‌లో చెబుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుక, తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని వరంగల్ సభ స్ఫూర్తితో విజయవంతం చేయాలని నిర్వాహకులను ఆయన కోరారు. వరంగల్ సభ అంచనాలకు మించి జరిగిందని, పోలీసుల అడ్డంకుల మధ్య సభకు 9 లక్షల మంది హాజరయ్యారన్నారు. ఒకటిన జరిగే సభకు కుటుంబాలతో వచ్చి బీఆర్ఎస్ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ సభతో తెలంగాణలోని అమెరికా వాసులంతా మళ్లీ బీఆర్ఎస్ పాలన వచ్చేలా తమ వంతు పాత్ర పోషించాలని ఎర్రబెల్లి అన్నారు.

హనుమకొండ చౌరస్తాలో చిరువ్యాపారులను ఓదార్చుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం

## చిరువ్యాపారులపై
# కాంగ్రెస్ ప్రతాపం

- **కూరగాయలు అమ్మేవారి జీవితాలను కూల్చుతున్నారు**
- **బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్**

హనుమకొండ చౌరస్తా, మే 30 : కాంగ్రెస్ పార్టీ పేదలపై ప్రతాపం చూపుతున్నదని, కూరగాయలు అమ్మేవారి జీవితాలను కూల్చుతున్నదని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ మండిపడ్డారు. హనుమకొండ చౌరస్తా వద్ద ఉన్న చిరువ్యాపారుల సముదాయాలను మున్సిపల్, పోలీసు అధికారులు తొలగించిన నేపథ్యంలో వారిని శుక్రవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా బాధితులు 15 ఏండ్లుగా చౌరస్తాలో చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ, కూరగాయలు అమ్ముతూ జీవనోపాధి పొందుతున్నామని, ఇటీవల పోలీసు, మున్సిపల్ అధికారులు తమ పొట్టకొట్టారని, వ్యాపార సముదాయాలను కూల్చారని కన్నీటి పర్యంతమయ్యారు. తమకు న్యాయం చేయాలని గోడు వెళ్లబోసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పేదలపై ప్రేమ లేదని, తమ జీవితాలను ఆగం చేసిందని వాపోయారు. పిండి రమేశ్ అనే చిరువ్యాపారి తన జీవితం ఆగమైందని, జీవనోపాధి కోల్పోయామని ఆత్మహత్యాయత్నం చేసుకొని ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతున్నాడని బాధిత కుటుంబ సభ్యులు వినయ్‌భాస్కర్‌కు తెలిపారు. మరో మహిళ తన కూతురుతో సహా ఇక్కడ ఏండ్లుగా కూరగాయలు అమ్ముతూ జీవిస్తున్నానని, ప్రస్తుతం రోజు గడవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేసింది. అనంతరం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. కార్మికుల హక్కులను కాల రాస్తే ఊరుకోమని, కార్మికులకు అండగా ఉద్యమిస్తామన్నారు. చిరువ్యాపారుల జీవితాలతో చెలగాటమొద్దని, వారికి ప్రభుత్వం నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని, చౌరస్తాలోని వారి అడ్డాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కొంతకాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక శాసన సభ్యులు, మున్సిపల్ మేయర్ కాజీపేట నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వరకు ప్రధాన రహదారి వెంట ఉన్న చిరువ్యాపారుల సముదాయాలను ధ్వంసం చేస్తున్నారని, వారి జీవితాలను చిద్రం చేస్తున్నారని మండిపడ్డారు. 2014 చిరువ్యాపారుల చట్టం ఉన్నా వారి పొట్ట కొడుతున్నారని, చట్టాలపై అవగాహనలేని ప్రభుత్వం పేదల బతుకులను ప్రశ్నార్థకం చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి పులి రజినీకాంత్, 4వ డివిజన్ అధ్యక్షుడు కంజర్ల మనోజ్‌కుమార్, 5వ డివిజన్ అధ్యక్షుడు బొల్లపెల్లి చందర్ పాల్గొన్నారు.

# ప్రాణాపాయ స్థితికి బాలింత

- **సీకేఎం ఆస్పత్రి నుంచి ఎంజీఎం దవాఖానకు తరలింపు**
- **వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన**

వరంగల్ చౌరస్తా, మే 30 : వరంగల్ సీకేఎం హాస్పిటల్‌లో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం మరోమారు బయటపడింది. ప్రసూతి కోసం వస్తే ప్రాణాలు పోయే స్థితికి తీసుకొచ్చారని ఆరోపిస్తూ బాధితురాలి బంధువులు హాస్పిటల్ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మే 25వ తేదీ ఆదివారం రాత్రి 10గంటల సమయంలో కాశికుంట ప్రాంతానికి చెందిన నజియాబేగం(32) నాల్గో కాన్పు నిమిత్తం కుటుంబ సభ్యులు సీకేఎం హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు శస్త్రచికిత్స చేయగా, బాబుకు జన్మనిచ్చింది. శస్త్రచికిత్స అనంతరం 4 గంటలపాటు ఆపరేషన్ థియేటర్ నుంచి ఆమెను బయటకు తీసుకురాలేదు. కుటుంబ సభ్యులకు కూడా చూపించకుండా ఐసీయూకి తరలించారు. శుక్రవారం ఉదయం వైద్యులు పరీక్షించి నజియాబేగం ఆర్యోగ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వెంటనే ఎంజీఎం దవాఖానకు తరలించాలని వైద్యులు సూచించారు. కుటుంబ సభ్యులు ఎంజీఎం తీసుకెళ్లేందుకు సన్నద్ధమయ్యారు. ఈ క్రమంలో కేస్‌షీట్ కనిపించడం లేదని సిబ్బంది తెలియజేయడంతో కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులు కావాలనే కేస్‌షీట్ కనిపించడం లేదని చెబుతున్నారని, వైద్యం వికటించడంతోనే బాధితురాలి పొట్ట భాగం ఉబ్బిందని ఆరోపిస్తూ ధర్నా చేపట్టారు. ఈ విషయంపై సీకేఎం హాస్పిటల్ ఆర్ఎంవో డాక్టర్ మురళిని వివరణ కోరగా.. వైద్య పరీక్షల కోసం తరలించిన సమయంలో కేస్‌షీట్ కనిపించకుండా పోయిన మాట వాస్తవమేనని, సీసీ కెమెరాల ఆధారంగా విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం బాధితురాలికి ఎంజీఎం దవాఖానలో పరీక్షలు నిర్వహించి, సిటీ స్కాన్ చేయడం జరిగిందని, ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందన్నారు. కేస్‌షీట్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిని గుర్తించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యాధికారుల వివరణపై కుటుంబసభ్యులు సంతృప్తి చెందక కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

బాధితురాలు నజియా భేగం

దవాఖాన ఎదుట ధర్నా చేస్తున్న బాధితురాలి కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు

### పనిచేయని ఫ్రీజర్లు..

ఎంజీఎం మార్చురీ విభాగంలో ఫ్రీజర్లు పని చేయక మృతదేహాలు ఒక్క రోజులోనే చెడిపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో మృతదేహాలను వారాల తరబడి మార్చురీలోనే ఉంచాల్సి ఉంటుంది. పోలీసు విచారణ, ఇతర అధికార ప్రక్రియ పూర్తయిన తర్వాతే బంధువులకు అప్పగించాలి. గుర్తు తెలియని మృతదేహాలను మూడు రోజుల పాటు భద్రపరుస్తారు. ఫ్రీజర్లు, ఏసీలు పనిచేయకపోవడంతో అంతిమ సంస్కారాలకు ముందే మృతదేహాలు పాడైపోతున్నాయి. ఇలాంటి స్థితిలో మృతదేహాలను గుర్తించేందుకు బంధువులు ఇబ్బంది పడుతున్నారు. మార్చురీలోని ఫ్రీజర్లు, ఏసీలు కొత్తవి పెట్టాలని ఈ విభాగంలోని డాక్టర్లు, సిబ్బంది ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నది.

ఎంజీఎంలో ఊడిపడిన ఎక్స్‌రే మిషన్ భాగం

చేతితో సెలైన్ బాటిల్ పట్టుకొని పేషెంట్‌ని ఎక్స్‌రే గదికి తీసుకువచ్చిన అటెండెంట్

స్ట్రాట్ కాకపోవడంతో అంబులెన్స్‌ని తోస్తున్న అటెండెంట్లు

*వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు కష్టాలు తప్పడం లేదు. పలు విభాగాల్లో నెలకొన్న సమస్యలు వీడడం లేదు. అధికారులు పర్యవేక్షించక.. ప్రజాప్రతినిధులు పట్టించుకోక పేదలకు వైద్య సేవలు అందడం లేదు. విద్యుత్ సరఫరా నుంచి అత్యవసర మందుల వరకు అంతా కొరతనే.. యంత్ర పరికరాలు, అంబులెన్స్‌లు, ఏసీలు, ఫ్యాన్లు.. ఇలా ఆస్పత్రిలోనే అనేకం పని చేయడం లేదు. ఇక మార్చురీలోని సమస్యలు అన్నీ ఇన్నీ కావు. అయితే అన్నీ సమకూర్చాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండగా.. వైద్యం కోసం వచ్చే పేదలు ఇబ్బందులు పడుతున్నారు.*

*- వరంగల్, మే 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

# పెద్దాస్పత్రికి అంతులేని కష్టాలు!

## ఎంజీఎం దవాఖానను వీడని సమస్యలు

- **సక్రమంగా లేని విద్యుత్ సరఫరా వ్యవస్థ**
- **అత్యవసర రోగులకు ప్రాణసంకటం**
- **పలు విభాగాల్లో పనిచేయని యంత్రాలు**
- **అందుబాటులో ఉండని అత్యవసర మందులు**
- **అధికారుల పర్యవేక్షణ లేక కొరవడిన సేవలు**
- **వైద్యం అందక పేదల ఇబ్బందులు**

వరంగల్ నగరాన్ని హెల్త్ సిటీగా అభివృద్ధి చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తే.. కాంగ్రెస్ సర్కారు హయాంలో దీనికి విరుద్ధంగా జరుగుతున్నది. పేదలకు పెద్ద దిక్కుగా ఉన్న వరంగల్‌లోని మహాత్మాగాంధీ మెమోరియల్ (ఎంజీఎం) హాస్పిటల్‌లో వైద్యం అందడంలేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లేక రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. వైద్య సేవలకు ఎప్పటికప్పుడు అవసరమయ్యే వసతులను రాష్ట్ర ప్రభుత్వం కల్పించడంలేదు. ఎంజీఎంలో కరెంటు సరఫరా వ్యవస్థ అస్తవ్యస్థంగా మారింది. దీంతో అత్యవసర వైద్య సేవలకు అవసరమైన పరికరాలను వినియోగించే పరిస్థితి ఉండడం లేదు. జనరేటర్ల వ్యవస్థ సైతం అంతంత మాత్రంగానే ఉన్నది. ఐసీయూ, ఆర్ఐసీయూ, గుండె జబ్బులు, ఆపరేషన్ థియేటర్, పిల్లల వార్డుల్లో వెంటిలేటర్లపై ఉండే రోగుల ప్రాణాలకు భరోసా లేకుండా పోతున్నది. పైగా యంత్రాలు, పరికరాలు కూడా అందుబాటులో ఉండడం లేదు. రేడియాలజీ విభాగంలో డిజిటల్ ఎక్స్‌రే యంత్రం సరిగా పని చేయడంలేదు. అత్యవసర విభాగంలో వినియోగించే మిషన్ పరిస్థితి కూడా ఇలాగే ఉన్నది. గుండె స్థితిని అంచనా వేసే ఈసీజీ యంత్రాలు అందుబాటులో లేవు. రోగ నిర్ధారణ కోసం వినియోగించే కెమికల్స్‌కు కూడా కొరత ఉన్నది.

### మందుల సరఫరా అంతంతే

వైద్య సేవల్లో కీలకమైన మందులు కూడా ఎంజీఎంకు సక్రమంగా సరఫరా కావడం లేదు. రోగులకు అవసరమైన మందులకు ఎప్పుడూ కొరత ఉంటుండగా, అనవసరమైనవి మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. సెంట్రల్ డ్రగ్ సెంటర్ నుంచి ఎంజీఎంకు మందులు రవాణా చేసే వాహనాలు కూడా తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. మందులను రోజూ కాకుండా వాహనాలు సరిగా ఉన్నప్పుడే తీసుకొస్తున్నారు. అత్యవసరంలో వినియోగించే నాలుగు అంబులెన్స్‌ల్లో ఒకటి మాత్రమే అంతంత మాత్రంగా పని చేస్తున్నది. పేద రోగులు ఎంజీఎంకు వచ్చేందుకు ప్రైవేట్ అంబులెన్స్‌లపై ఆధారపడాల్సి వస్తున్నది. అత్యవసర పరిస్థితి, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలున్న వారికి ఐసీయూ, ఇతర ప్రత్యేక వ్యవస్థలున్న ప్రాంతంలోనే చికిత్స అందిస్తారు. ఎంజీఎంలో ఇలాంటి ప్రత్యేక వ్యవస్థలు సరిగా లేవు. ఏసీలతో పాటు ఫ్యాన్లు సైతం పని చేయడంలేదు. రోగులు ఇంటి నుంచి ఫ్యాన్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది.



బ్యాండేజీతో అంబులెన్స్ బ్యాటరీని కట్టి ఉంచిన సిబ్బంది

# ములుగు.. ఇక మున్సిపాలిటీ

- **20 వార్డులతో ఏర్పాటు**
- **ఉత్తర్వులు జారీ చేసిన మున్సిపల్ శాఖ కమిషనర్**
- **కమిషనర్‌గా గ్రేడ్-3 అధికారి సంపత్ బాధ్యతలు**

ములుగు జిల్లా కేంద్రం వ్యూ

ములుగు, మే 30 (నమస్తే తెలంగాణ) : గ్రామ పంచాయతీగా ఉన్న ములుగు జిల్లా కేంద్రం మున్సిపాలిటీగా ఏర్పాటైంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర మున్సిపల్ శాఖ కమిషనర్ డాక్టర్ టీకే శ్రీదేవి ఈ నెల 28న ఉత్తర్వులు జారీచేశారు. 29వ తేదీ నుంచి ములుగు, జీవంతరావుపల్లి, బండారుపల్లి గ్రామాలను విలీనం చేస్తూ 20 వార్డులను ఏర్పాటు చేశారు. కమిషనర్‌గా గ్రేడ్–3 అధికారి జే సంపత్‌ను నియమించగా ఆయన శుక్రవారం విధుల్లో చేరారు. అలాగే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనరేట్ పరిధిలో టాక్సేషన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వై రామకృష్ణను ములుగు మున్సిపల్ టాక్సేషన్ ఆఫీసర్‌గా నియమించారు. కాగా, మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న ములుగును గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాగా ప్రకటించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో ఏకైక జీపీగా ఉన్న ములుగును మున్సిపాలిటీగా మార్చేందుకు గత సర్కారు అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించింది. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు రావడం, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిన్నర తర్వాత ములుగును మున్సిపాలిటీగా ప్రకటిస్తూ జీవో విడుదల కావడంతో గ్రామ పంచాయతీ పాలనకు తెరపడనుంది.

కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సంపత్

### 16,533 మంది జనాభా..

ములుగు, బండారుపల్లి, జీవంతరావుపల్లి జీపీలను విలీనం చేస్తూ ఏర్పాటు చేసిన మున్సిపాలిటీలో మొత్తం 16,533 మంది జనాభా ఉన్నారు. ములుగు జీపీ పరిధిలో పాల్‌సాబ్‌పల్లి, రంగారావుపల్లి, ప్రేమ్‌నగర్, మాధవరావుపల్లి, జీవంతరావుపల్లిలో గణేశ్‌లాల్‌పల్లి శివారు గ్రామాలుగా ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం ములుగులో 16 వార్డులు, 4 శివారు పల్లెలతో కలుపుకొని 12,135 జనాభా ఉండగా, 9,422 మంది ఓటర్లున్నారు. అలాగే బండారుపల్లిలోని 12 వార్డుల్లో 3,187 జనాభా, 2,436 ఓటర్లు, జీవంతరావుపల్లిలోని 8 వార్డుల్లో 1,211 జనాభా, 628 మంది ఓటర్లున్నారు.

# సింగరేణి క్వార్టర్స్‌లో దొంగల బీభత్సం

- **ఆరు ఇళ్లల్లో చోరీ.. నగదు, ఆభరణాలు, బైక్ అపహరణ**
- **సెక్యూరిటీ నిర్లక్ష్యమే కారణం అంటున్న కార్మికులు**

గణపురం, మే 30 : సింగరేణి పరిసర ప్రాంతాల్లో దోపిడీ దొంగలు రోజు రోజుకూ రెచ్చిపోతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని చెల్పూర్ శివారులో సింగరేణికి సంబంధించిన 'వేయి క్వార్టర్స్'లో శుక్రవారం తెల్లవారు జామున దొంగలు బీభత్సం సృష్టించారు. 16, 17, 21, 31 బ్లాకుల్లోని ఆరు ఇళ్లల్లో ఓకే రోజు చోరీకి పాల్పడ్డారు. నాలుగు తులాల బంగారం, రూ. 13,000 నగదు, బైక్, ఇళ్లల్లోని ఇతర వస్తువులు ఎత్తుకెళ్లారు. గత 20 రోజుల వ్యవధిలో దొంగలు సుమారు 20కి పైగా ఇళ్లను దోచుకొని పోలీసులకు సవాలు విసురుతున్నారు. సింగరేణి కార్మికులు రాత్రి విధులకు వెళ్లడం, కుటుంబాలు ఊళ్లకు పోవడంతో దొంగలు ఇండ్లలోకి చొరబడుతున్నారు. సింగరేణి క్వార్టర్స్‌లో సీసీ కెమెరాలు కూడా లేకపోవడం వారికి కలిసివస్తున్నది. క్వార్టర్లలో సరైన సాంకేతికతతో నిఘా వ్యవస్థ లేకపోవడంతో పోలీసులు, సింగరేణి అధికారులపై కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ అప్రమత్తంగా ఉండాల్సిన సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతోనే దొంగతనాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చోరీ జరిగిన ఇళ్లల్లో ఫింగర్ ప్రింట్స్, క్లూస్ టీం సిబ్బంది ఆధారాలు సేకరించారు. కార్మికులు తమ బ్లాక్ వద్ద ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరా ఆధారంగా దొంగలను గుర్తించేందుకు పోలీసులు యత్నిస్తున్నారు.

ఇంట్లోని వస్తువులను చిందరవందరగా పడేసిన దొంగలు

# ఇందిరమ్మ ఇల్లు రాలేదని హోర్డింగ్ ఎక్కి ఆత్మహత్యాయత్నం

- **పోలీసు హెడ్‌క్వార్టర్స్ ముందే ఘటన**
- **కాంగ్రెస్ వాళ్లు మోసం చేశారని మహమ్మద్ పాషా ఆవేదన**

నయీంనగర్, మే 30 : కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు రావడం లేదని, ఇల్లు ఇస్తామని చెప్పి మోసం చేశారని హనుమకొండ జిల్లా రాంనగర్‌కు చెందిన మహమ్మద్ పాషా శుక్రవారం వరంగల్ పోలీసు హెడ్ క్వార్టర్స్ ఎదుట ఉన్న హోర్డింగ్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు, మరికొందరు నాయకులు వచ్చి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా తనకు నమ్మకం లేదని తేల్చి చెప్పాడు. పశ్చిమ నియోజకవర్గం రాంనగర్‌లో ఉంటున్నానని తెలిపాడు. గత ఏడాది వానకాలంలో కురిసిన వర్షాలకు తన ఇల్లు మునిగిపోయిందని, అప్పుడు కాంగ్రెస్ వాళ్లు వచ్చి ఇల్లు ఇస్తామని చెప్పారని పేర్కొన్నాడు. అయితే పశ్చిమ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేదన్నాడు. ఇండ్లున్న వారికే ఇచ్చారని చెప్పాడు. నాలుగేళ్ల క్రితం తన తండ్రి మరణించాడని, సోదరి పెండ్లి చేయాల్సి ఉన్నదన్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తమకు ఇల్లు వస్తుందని ఆశించామని, నమ్మించి మోసం చేశారని వాపోయాడు. ఇందిరమ్మ ఇల్లు రాకపోవడంతో బాధగా అనిపించి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి ఫోన్ చేశానని, ఆయన లిఫ్ట్ చేయలేదని చెప్పాడు. ఇల్లు రాలేదనే బాధతో ఏం చేయాలో తోచక ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు మహమ్మద్ పాషా తెలిపాడు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాలో అర్హులకు చోటు దక్కలేదని మహమ్మద్ పాషా హోర్డింగ్ ఎక్కిన చోట గుమిగూడిన వారు చర్చించుకున్నారు.

గత వానకాలంలో మునిగిన మహ్మద్ పాషా ఇల్లు

హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఎదురుగా ఉన్న హోర్డింగ్ ఎక్కిన మహ్మద్ పాషా